సాక్షి
మెదక్
ఆదివారం । 24 । సెప్టెంబర్ । 2023



ఒక్కొక్కటి కోటికి పైనే..

మద్యం లైసెన్సులు దక్కకపోవడంతో గుడ్ విల్ చెల్లించి వాటిని సొంతం చేసుకున్న వారు వచ్చే రెండేళ్లలో పెట్టుబడి వస్తుందో లేదోననే అయోమయంలో ఉన్నారు.

వివరాలు 8లో ▸



చెరువులో విష ప్రయోగం!

సిద్దిపేట జిల్లా నంగునూరులో చెరువులో క్రిమిసంహారక డబ్బాలు దొరకడంతో విషప్రయోగం జరిగిందా..అనే అనుమానం వ్యక్తమవుతోంది.

వివరాలు 8లో ▸

రేపటి ప్రజావాణి రద్దు

మెదక్ కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఈ నెల 25న జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ రాజర్షిషా ఓ ప్రకటనలో తెలిపారు. కార్యాలయంలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఉన్నందున రద్దు చేసినట్లు పేర్కొన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే వారు గమనించాలన్నారు.

సెల్ఫీ విత్ గణేశ్



మీరు విఘ్నేశ్వరుడిని ప్రత్యేక ఆకృతుల్లో ప్రతిష్ఠించారా.. పర్యావరణాన్ని కాపాడే రీతిలో గానీ, ఏ అంశంపైనైనా సమాజానికి సందేశం ఇచ్చే రీతిలో మీ వినాయకుడు ఉన్నాడా.. మీ కాలనీల్లో, అపార్ట్‌మెంట్‌లలో ఏర్పాటు చేసుకున్న వినాయకుడు ఏదైనా స్పెషల్‌గెటప్‌లో ఉన్నాడా.. అయితే, మీ వినాయకుడితో మీరు సెల్ఫీ తీసుకుని మాకు పంపితే.. ఆ ఫొటోలలో ఎంపిక చేసి ప్రచురిస్తాం.

మీరు సెల్ఫీ పంపాల్సిన వాట్సప్ నం.

89855 54525

న్యూస్‌రీల్

రెన్యువల్ చేయించుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి గోవింద్

నర్సాపూర్ రూరల్: రుణమాఫీకి అర్హులైన రైతులు బ్యాంకులో రెన్యువల్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ సూచించారు. శనివారం నర్సాపూర్ రైతువేదికలో డివిజన్ స్థాయి అధికారులతో రుణమాఫీ, రైతుబీమాపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతుబీమా క్లైమ్ త్వరగా అయ్యేలా ఏడీఏలు, ఏఓలు, ఏఈఓలు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పంటలను పరిశీలించి రైతులకు తగిన సలహాలు సూచనలు ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు. ఏడీఏ సంధ్యారాణి, నర్సాపూర్, శివంపేట, మనోహరాబాద్ ఏఓలు అనిల్ కుమార్, లావణ్య, స్రవంతి పాల్గొన్నారు.

పారదర్శకంగా పదోన్నతులు



డీఈఓ రాధాకిషన్‌కు వినతిపత్రం ఇస్తున్న తపస్ నాయకులు

మెదక్ కలెక్టరేట్: ఉపాధ్యాయ బదిలీ, పదోన్నతుల్లో పారదర్శకత పాటించాలని తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, చల్లా లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్‌లో డీఈఓ రాధాకిషన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యాశాఖ ఆదేశాల ప్రకారం మెడికల్ గ్రౌండ్, స్పౌజ్ ఆప్షన్ వాడుకునేలా ఆదేశాలు ఇవ్వాలని, సీనియార్టీ జాబితాలో పొరపాట్లు లేకుండా చూడాలని, కోర్టు తీర్పుకు లోబడి భాషా పండిట్‌లు, పీఈటీలకు పదోన్నతి కల్పించాలన్నారు. తపస్ బాధ్యులు నరసింహులు, నరేందర్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జడ్జి రీటాలాల్ చంద్

మెదక్: మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి రిటా లాల్ చంద్ అన్నారు. శనివారం కూచన్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. బాలికలకు చిన్నతనంలో వివాహం చేయొద్దని, పెళ్లీడు వచ్చిన తర్వాతే జరిగించాలన్నారు. బాల్య వివాహాలతో కలిగే నష్టాలపై వివరించారు. బహిరంగ ప్రదేశాల్లో ఎవరైనా వేధిస్తే పోలీసులు, షీటీం సమాచారం ఇవ్వాలని, ధైర్యంగా సమస్యను ఎదుర్కోవాలని సూచించారు. బాగా చదివి ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని, ఫోన్, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మధుమోహన్, లెక్చరర్స్, న్యాయవాదులు సిద్దా గౌడ్, నందు నాయక్, చిరంజీవి, సాయిలు, నర్సిములు, నిర్మల, డీసీపీఓ చైర్‌పర్సన్ కరుణశీలా, సఖి సెంటర్ టీమ్, తదితరులు పాల్గొన్నారు.

చెదిరిన కల!

గ్రూప్–1 పరీక్ష రద్దు రెండో 'సారీ'

- నిరుద్యోగుల ఆశలు అడియాసలు
- ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి 12,921 ప్రిలిమ్స్ రాసిన అభ్యర్థులు



సాక్షి, సిద్దిపేట: గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షను ప్రభుత్వం మళ్లీ రద్దు చేసింది. పరీక్ష కేంద్రంలో బయోమెట్రిక్ తీసుకోలేదని, హాల్‌టికెట్ నంబర్ లేకుండా ఓఎంఆర్ షీట్ ఇచ్చారని పలువురు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో గ్రూప్–1 పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని హైకోర్టు ఆదేశించింది. తొలి సారిగా అక్టోబర్ 22, 2022న ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించగా పేపర్ లీకేజీ కారణంగా రద్దు చేశారు. రెండోసారి జూన్ 11న నిర్వహించగా ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి 19,733 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 12,921 మంది పరీక్ష రాశారు. సిద్దిపేట నుంచి 5,366, సంగారెడ్డిలో 5,396, మెదక్‌లో 2,159 మంది పరీక్ష రాశారు. మళ్లీ గ్రూప్–1 పరీక్ష కోర్టు రద్దు చేయడంతో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. రెండేళ్లుగా రోజుకు 18 గంటలకు పైగా చదివి పరీక్ష రాసినవారు రద్దుతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు. కొందరు ప్రభుత్వ ఉద్యోగులు సెలవు పెట్టి మరీ పరీక్షకు సిద్ధమయ్యారు. చివరకు పరీక్ష బాగా రాశాం అని సంతోషించిన వారి ఆశలు అడియాసలయ్యాయి. మెయిన్స్ ప్రిపేర్ అవుతున్నవారు హైకోర్టు నిర్ణయంతో దిగాలు చెందుతున్నారు.

పరిహారం అందించాలి



గ్రూప్ వన్ ప్రిలిమినరీ రెండుసార్లు రద్దు అవడంతో చాలా రోజులుగా ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయారు. అందువలన నష్టపోయిన అభ్యర్థులకు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రూ.5లక్షల పరిహారం అందించింది ఆదుకోవాలి. అదేవిధంగా గ్రూప్–1 రద్దుకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి.

– అశోక్, ఎన్సాన్‌పల్లి

కాంట్రాక్ట్ ఉద్యోగాన్ని వదిలి..



చేగుంట మండల కేంద్రంలోని ఎస్టీ గురుకుల పాఠశాలలో టీజీటీ తెలుగు కాంట్రాక్ట్ ఉపాధ్యాయురాలిగా పని చేశా. గ్రూప్–1 పరీక్ష కోసం ఆ పోస్టుకు రిజైన్ చేశాను. ఉన్న ఉద్యోగం పోయింది... కొత్త ఉద్యోగం వస్తది అనుకుంటే.. ఆ పరీక్ష రద్దు చేశారు. అనాలోచి నిర్ణయాలతో నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– చల్ల శ్రీలత, చేగుంట

నిరుద్యోగులకు శాపం



ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే నిరుద్యోగులకు శాపంలా మారింది. ప్రైవేట్ జాబ్ మానేసి నెలల తరబడి హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకుని ప్రిలిమ్స్ పరీక్ష రాయగా రద్దు అయింది. నిబంధనలు పాటించకుండా మళ్లీ పరీక్షలు నిర్వహించడంతో కోర్టు రద్దు చేసింది. డబ్బు, సమయం వృథా చేసి ఇంటికి దూరంగా ఉండి పరీక్షలు రాయగా ఫలితంలేకుండా పోయింది.

– రమేష్, జహీరాబాద్

కొత్త సభ్యులను నియమించాలి



గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షలు రెండుసార్లు రద్దు కావడానికి ప్రధాన కారణమైన టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలి. నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసిన అనంతరం మిగతా పరీక్షలు నిర్వహించాలి. ఒకసారి జరిగిన పొరపాటును మళ్లీ చేయడంతో ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారు. మరోసారైనా పరీక్షను సక్రమంగా నిర్వహించాలి.

– నీలిమ, సిద్దిపేట

సమయమంతా వృథా



ఏళ్లతరబడి కష్టపడి చదివాం. సమయానికి తిండి లేకుండా, డబ్బు ఖర్చు పెట్టి గ్రూప్–1 పరీక్ష రాస్తే.. ప్రయోజనం లేకుండా పోయింది. పరీక్ష రద్దు కావడంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు. మళ్లీ పరీక్ష ఎప్పుడు ఉంటుందో తెలియని పరిస్థితి. వయసు మీద పడుతుంది, కుటుంబ పోషణ భారమైంది.

– ఎరుకలి యాదగిరి, హత్నూర



ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రెటరీ

రోడ్డు నిర్మాణం అద్భుతం

- అధికారులను ప్రశంసించిన ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా

హుస్నాబాద్‌రూరల్ : పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారుల పనితీరును ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా అభినందించారు. శనివారం ఆయన హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) నుంచి నాగారం వరకు కాయర్‌తో నిర్మించిన బీటీ రోడ్డును పరిశీలించారు. రెండు గ్రామాల మధ్య రూ.2.45 కోట్ల వ్యయంతో 3.49 కి.మీల మేర బీటీ రోడ్డు నిర్మించారు. గుట్టల ప్రాంతంలో ఏర్పాటు చేయడంతో నీటి ఊటలకు రోడ్డు దెబ్బతిన కుండా ఇంజినీరింగ్ అధికారులు కాయర్ (కొబ్బరి పీచు)ను ఉపయోగించారు. దీనిని వినియోగించడం వలన 15 ఇంచుల మెటల్ వేయాల్సి ఉండగా 12 ఇంచుల మెటల్ మాత్రమే ఉపయోగించారు. దీని గురించి ప్రిన్సిపల్ సెక్రెటరీకి ఇంజినీరింగ్ అధికారులు వివరించారు. కాయర్ వాడటం వలన మెటల్ తక్కువ పడుతుందని, ఒక కిలో మీటర్‌కు రూ.1.40లక్షలు ఆదా అవుతుందని తెలిపారు. కొబ్బరి పీచును మధ్య ప్రదేశ్ నుంచి తెప్పించినట్లు చెప్పారు. ప్రభుత్వ నిధులు వృథా కాకుండా అభివృద్ధి పనులు చేపట్టిన డీఓ సదాశివారెడ్డి, ఏఈ స్నేహ పనితీరు పట్ల సందీప్‌కుమార్ సుల్తానియా ప్రశంసించారు. వీరి వెంట జెడ్పీవైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, ఎంపీపీ మానస, మార్కెట్ చైర్‌పర్సన్ ఎడబోయిన రజిని తిరుపతిరెడ్డి, సర్పంచ్ బత్తిని సాయిలు, ఎంపీటీసీ బొమ్మగాని శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

లక్ష్మక్కపల్లి నర్సరీ సందర్శన

ములుగు(గజ్వేల్): ములుగు మండలం లక్ష్మక్కపల్లి గ్రామాన్ని ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా శనివారం సందర్శించారు. గ్రోమోర్ నర్సరీని పరిశీలించారు. ఆయన వెంట జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ జయదేవ్, అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కౌసల్యాదేవి, జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవీ, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

కొమురవెల్లి(సిద్దిపేట): రాజీవ్ రహదారి నుంచి మల్లన్న ఆలయం వరకు విస్తరిస్తున్న రోడ్డు పనులను ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ సుల్తానియా శనివారం పరిశీలించారు. ఆయన వెంట జిల్లా అధికారులు, మండల అధికారులు ఉన్నారు.

పనులపై ఆరా..

సిద్దిపేటరూరల్: జిల్లా పర్యటనకు వచ్చిన ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియాను శనివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో అమలవుతున్న పంచాయతీరాజ్ పనుల గురించి చర్చించారు.

సమస్యాత్మక కేంద్రాలపై దృష్టి

కలెక్టర్ రాజర్షిషా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా, పక్కన ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

మెదక్ కలెక్టరేట్: జిల్లాకు సంబంధించిన ఎన్నికల సంసిద్ధత వివరాలను సిద్ధం చేయాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఎస్పీ రోహిణి ప్రియదర్శిని, రిటర్నింగ్, పోలీసు, సహాయ ఎన్నికల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అక్టోబర్ 4న కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు నిర్వహించే సమీక్షకు వివరాలను సిద్ధం చేయాలని సూచించారు. ఓటరు జాబితా, నిష్పత్తి వంటి అంశాలపై ఈఆర్‌ఓలు, మండల కేంద్రాల్లో తహసీల్దార్లు పక్కాగా నమోదు చేయాలన్నారు. పెండింగ్ ఉన్నట్లయితే తక్షణమే పూర్తి చేసి నివేదిక సమర్పించాలన్నారు. కొత్తగా ఓటర్లకు ఫొటో గుర్తింపు కార్డుల కోసం ప్రింటింగ్‌కు పంపాలన్నారు. కేంద్రాల్లో ర్యాంపు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలను పరిశీలించాలని, వృద్ధులు, దివ్యాంగుల కోసం ఏర్పాట్లు చేయాలన్నారు.

సమన్వయంతో పని చేయాలి: ఎస్పీ

పోలీస్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పని చేసి పోలింగ్ కేంద్రాల వద్ద సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని అన్నారు. సరిహద్దు చెక్ పోస్టుల్లో భద్రత కట్టుదిట్టం చేయాలని, సీసీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన అనంతరం తనిఖీలు చేపట్టాలని, డబ్బు తరలించే వారిపై నిఘా పెట్టి సరియైన పత్రాలు, వాహనాల అనుమతులను పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ మహేందర్, ఆర్డీఓలు జయచంద్ర, అంబదాస్ రాజేశ్వర్, శ్రీనివాస్, పోలీసు ఉన్నత అధికారులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

గోదాంలో బియ్యం గోల్‌మాల్

ఇన్‌చార్జ్‌కి షోకాజ్ నోటీస్

రామాయంపేట(మెదక్): రామాయంపేట సివిల్ సప్లై గోదాంలో 1400 క్వింటాళ్ల బియ్యం గోల్‌మాల్‌పై సంబంధిత అధికారులు స్పందించారు. శనివారం గోదాం ఇన్‌చార్జ్ సతీశ్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. పౌరసరఫరాల శాఖ డీఎం హరికృష్ణ, జిల్లా సివిల్ సప్లై అధికారి బ్రహ్మారావు నిర్వహించిన తనిఖీలో తేడాలు ఉన్నట్లు గుర్తించారు. గోదాంలో నిల్వ ఉన్న గోనె సంచులకు సంబంధించి త్వరలో ఆడిట్ నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. రెండు, మూడు రోజుల్లో కొత్త ఇన్‌చార్జ్‌ని నియమించనున్నట్లు సమాచారం.

అన్ని రంగాల్లో సత్తా చాటుతాం

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి



మాట్లాడుతున్న సునీతారెడ్డి

నర్సాపూర్ రూరల్: మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదంతో తమకు అన్ని రంగాల్లో సత్తా చాటే అవకాశం లభించిందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. శనివారం నర్సాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వాలు మహిళా బిల్లు కోసం ప్రయత్నించినా అమలు కాలేదన్నారు. ప్రస్తుతం పార్లమెంట్, రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే, ఎంపీలుగా ఎక్కువ మంది మహిళలకు అవకాశం వస్తుందని, దీనిని తక్షణం అమల్లోకి తేవాలని కోరారు. మహిళా బిల్లు ఆమోదానికి ఎమ్మెల్సీ కవిత చేసిన కృషిని కొనియాడారు. కేంద్రంలో అన్ని పార్టీలను ఏకతాటిపై తీసుకువచ్చి ధర్నా చేయడంతోనే కార్యరూపం దాల్చిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నయీముద్దీన్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు భోగ శేఖర్, సత్యం గౌడ్, సూరారం నరసింహులు, సుధాకర్ రెడ్డి, షేక్ హుస్సేన్, తొంట వెంకటేష్ పాల్గొన్నారు.

వీక్లీ పరేడ్‌తో ఫిజికల్ ఫిట్నెస్

ఎస్పీ రోహిణి ప్రియదర్శిని



పరేడ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

మెదక్ మున్సిపాలిటీ: వీక్లీ పరేడ్‌తో ఫిజికల్ ఫిట్నెస్ లభిస్తుందని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని అన్నారు. శనివారం జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్, హోంగార్డ్ సిబ్బందికి వీక్లీ పరేడ్ నిర్వహించారు. పరేడ్‌కు హాజరై గౌరవ వందనం స్వీకరించి, ఆర్మ్స్ డ్రిల్, స్క్వాడ్ డ్రిల్ ప్రదర్శనను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. సమయం దొరికినప్పుడు సిబ్బంది, అధికారులు వ్యాయామం చేయాలని, వ్యక్తిగత, ఆరోగ్య సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. రెగ్యులర్‌గా హెల్త్ చెకప్ చేయించుకోవాలని ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీ ఫణీంద్ర, సీఐలు వెంకట్, రాజశేఖర్ రెడ్డి, ఆర్ఐలు నాగేశ్వర్ రావు, అచ్యుతరావు, ఆర్‌ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికతో భద్రత బలోపేతం

మెదక్ మున్సిపాలిటీ: రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ముందస్తు ప్రణాళికతో భద్రత బలోపేతం చేయొచ్చని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల సమయంలో పాటించే విధులకు సంబంధించి సిబ్బందికి ఒక రోజు శిక్షణ నిర్వహించినట్లు తెలిపారు. పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, పోలింగ్ కేంద్రాలపై నిఘా పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్, తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం తగదు



దీక్ష చేస్తున్న అంగన్‌వాడీలు

మెదక్ కలెక్టరేట్: అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె విచ్ఛిన్నానికి ఐసీడీఎస్ మంత్రి తప్పుడు ప్రచారం చేయడం సరికాదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మల్లేశం అన్నారు. శనివారం కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీలు చేస్తున్న దీక్షకు మద్దతు తెలిపారు. అంగన్‌వాడీల సమస్యలపై ఆగస్టు 18న చర్చలు జరిపిన మంత్రి కొన్నింటినే తీర్చారని, మిగతా హామీలను వెంటనే పరిష్కరించాలన్నారు. పనికి తగిన వేతనం, బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగులతో చర్చలు జరిపి డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. అన్నపూర్ణ, విజయలక్ష్మి, అనురాధ, నవీన, సుమలత, రాజ్యలక్ష్మి, లతీఫ్ ఉన్నిసా, స్వరూప, షహనాజ్ బేగం, భారతి తదితరులు పాల్గొన్నారు.

పేదల బియ్యంతో దందా

- రైస్ మిల్లర్ల ఇష్టారాజ్యం
- పల్లెల్లో యథేచ్ఛగా వ్యాపారం
- చేతులు మారుతున్న వేల క్వింటాళ్లు
- దృష్టి సారించని అధికారులు



మెదక్‌లో రేషన్ బియ్యం సేకరిస్తున్న వాహనం

మెదక్: పేదల కడుపు నింపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ దుకాణాల ద్వారా అందిస్తున్న బియ్యం అక్రమార్కులకు నిత్య సంపాదనగా మారుతోంది. గ్రామాల్లో పంపిణీ చేస్తున్న బియ్యంలో కొంతమట్టుకే లబ్ధిదారులు వినియోగిస్తుండగా సింహ భాగం బ్లాక్ మార్కెట్‌కు తరలుతోంది. రైస్ మిల్లర్లు గ్రామాల్లో ఏజెంట్లను పెట్టి వాహనాల ద్వారా లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు సేకరిస్తున్నారు. ఇలా సేకరించిన బియ్యాన్ని సీఎంఆర్‌గా మార్చి ఎఫ్‌సీఐ గోదాంలకు అప్పగిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రతీనెలా వేల క్వింటాళ్ల బియ్యం దందా జరుగుతున్నా.. అధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలున్నాయి.

జిల్లాలో...

మెదక్ జిల్లా వ్యవసాయానికి పెట్టింది పేరు. గత కొన్నేళ్లుగా వర్షాలు సమృద్ధిగా కురవడం, కాళేశ్వరం నీరు రావడంతో జిల్లాలో 3లక్షల పై చిలుకు ఎకరాల్లో వరి సాగైంది. ఈ క్రమంలో రైతులు యాసంగి, వానాకాలంలో పెద్ద ఎత్తున ధాన్యం పండించారు. కొనుగోలు కేంద్రాలకు పెద్ద ఎత్తున ధాన్యం నిల్వలు రావడంతో వాటిని అధికారులు సంబంధిత మిల్లర్లకు అప్పగించారు. నిర్ణీత సమయంలోగా సీఎంఆర్ చేసి అందించాల్సిన బియ్యాన్ని రైస్ మిల్లర్లు బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అక్కడితో ఆగకుండా గోదాంలకు బియ్యం అప్పగించే సమయంలో వ్యాపారుల తో గ్రామాల నుంచి సేకరించిన రేషన్ బియ్యాన్ని సీఎంఆర్‌గా మారుస్తూ పీడీఎస్ బియ్యాన్ని అప్పగిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

తక్కువ ధరకు విక్రయం..

జిల్లా వ్యాప్తంగా 7,67,240 మంది జనాభాకు 2,14,090 రేషన్ కార్డులు ఉన్నాయి. అంత్యోదయ 13,884, ఆహార భద్రత 2,00,138, అన్నపూర్ణ కార్డులు 68 ఉన్నాయి. నెలకు 3045.900 మెట్రిక్ టన్నుల బియ్యం జిల్లాకు సరఫరా అవుతుండగా ఇందులో కేవలం 20శాతం మాత్రమే పేదలు వినియోగిస్తున్నారు. మిగతా 80శాతం బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఈ బియ్యం రైస్ మిలర్లు.. అక్కడి నుంచి ఎఫ్‌సీఐ గోదాంకు, అక్కడి నుంచి తిరిగి రేషన్ డీలర్లకు పీడీఎస్‌గా పంపిణీ అవుతోంది. ఇంత జరుగుతున్నా అధికారులు రైస్ మిల్లర్లపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. గ్రామాల్లో ప్రతీనెలా 5నుంచి 15 తారీఖు వరకు డీలర్లు ప్రజలకు బియ్యాన్ని పంపిణీ చేయగానే, వ్యాపారులు వాహనాలతో గ్రామాల్లో పర్యటించి లబ్ధిదారుల నుంచి వీటిని సేకరిస్తున్నారు. ప్రజల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని కిలోకు రూ.2 కమీషన్ చొప్పున మిల్లర్లకు అప్పగిస్తున్నారు. కిలో బియ్యం పంపిణీ చేసేందుకు ప్రభుత్వానికి రూ.30ఖర్చు అవుతుండగా, మిల్లర్లు, వ్యాపారులు మాత్రం కిలోపై రూ.15 లాభం పొందుతున్నారు. సంబంధితశాఖ అధికారులకు విషయం తెలిసినా మామూళ్ల మత్తుతో పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. జిల్లా కేంద్రంలో ఇప్పటికే 200ల పైచిలుకు రైస్ మిల్లర్లు పీడీఎస్ బియ్యం దందాతో లాభాలు గడిస్తున్నారు.

క్వాలిటీని పరిశీలిస్తున్నాం

జిల్లాలో ఎప్పటికప్పుడు అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. రైస్ మిల్లర్లు అందిస్తున్న బియ్యాన్ని క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలిస్తున్నారు. తాజాగా మిల్లింగ్ అయిన బియ్యం, పీడీఎస్ బియ్యానికి తేడా ఉంటుంది. రైస్ మిల్లర్లు పీడీఎస్ బియ్యాన్ని ఇచ్చినట్లు తేలితే చర్యలు తప్పవు.

– బ్రహ్మాజీ, డీఎస్‌ఓ, మెదక్

క్లుప్తంగా

పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్‌

సిద్దిపేటకమాన్‌: ప్రభుత్వ బాలుర హైస్కూల్లో 25 నుంచి డిప్లొమా ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌ రెండో సంవత్సరం పరీక్షలు జరగనున్నాయి. అందువల్ల పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్‌ అమల్లో ఉంటుందని సీపీ శ్వేత శనివారం తెలిపారు. 25 నుంచి వచ్చే నెల 3 వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 6 నుంచి సాయంత్రం 4 వరకు ఈ నిబంధనలు అమల్లో ఉంటాయన్నారు. పరీక్షా కేంద్రం సమీపంలోని అన్ని జిరాక్స్‌ సెంటర్లు మూసివేయాలని, భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

నిందితుడికి రిమాండ్‌

వెల్దుర్తి(తూప్రాన్‌): మెల్లూర్‌ గ్రామంలో బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన నిందితుడిని శనివారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా ప్రథమ శ్రేణి మేజిస్ట్రేట్‌ 14 రోజుల రిమాండ్‌ విధించారని ఎస్‌ఐ మధుసూధన్‌గౌడ్‌ తెలిపారు. మహిళలపై అసభ్యంగా ప్రవర్తించినా, లైంగిక వేధింపులకు పాల్పడినా.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఖోఖోలో సత్తాచాటిన విద్యార్థులు


ఖోఖోలో సత్తా చాటిన విద్యార్థులు

జహీరాబాద్‌ టౌన్‌: స్కూల్‌ గేమ్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో మండల స్థాయిలో జరిగిన ఖోఖో పోటీల్లో స్థానిక సిద్దార్థ స్కూల్‌ విద్యార్థులు సత్తాచాటారు. అండర్‌ 17 విభాగంలో నలుగురు బాలురు, ముగ్గురు బాలికలు సత్తాచాటి 26, 27 తేదీల్లో జోగిపేటలో జరగనున్న జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిని ప్రిన్సిపాల్‌ శేఖర్‌రెడ్డి, పీఈటీ సుందర్‌రాజ్‌ అభినందించారు.

ఒక్కొక్కటి కోటికి పైనే..

- గుడ్‌విల్‌తో వైన్‌షాపుల కొనుగోలు
- సిద్దిపేట పరిధిలో వ్యాపారుల అడ్డదారులు
- ఇంత మొత్తం వెచ్చిస్తే లాభాలు దక్కేనా?



సాక్షి, సిద్దిపేట: కొన్ని ఏళ్లుగా మద్యం వ్యాపారం చేస్తున్న వారికి ఈసారి లైసెన్సులు దక్కలేదు.. దీంతో కోటి రూపాయలకు పైగా గుడ్‌విల్‌ చెల్లించి వాటిని దక్కించుకుంటున్నారు. అయితే ఒక మద్యం దుకాణం ద్వారా రూ.కోటిపైగా లాభం వస్తుందా? గుడ్‌విల్‌తో పాటు, ఎక్సైజ్‌ శాఖకు లైసెన్స్‌ ఫీజు ఎలా చెల్లిస్తారు? అనేది మద్యం వ్యాపారుల్లో పెద్ద ప్రశ్నగా మారింది. మద్యం అమ్మకాల్లో అడ్డదారులు తొక్కితే తప్ప రెండేళ్లలో రెండు కోట్లకు పైగా ఆదాయం రాదని వారంతా అనుకుంటున్నట్లు సమాచారం. ఒకవేళ లాభాలు రాకపోతే నకిలీ మద్యం విక్రయిస్తారా? అనే సందేహం రాక తప్పదు. అందుకు ఇటీవల ములుగు మండలం కొత్తురు గ్రామంలో లభించిన నకిలీ, గోవా మద్యమే నిదర్శనం.

93 వైన్‌షాపులకు 4,166 మంది పోటీ

జిల్లాలో మొత్తం 93 మద్యం దుకాణాలు ఉండగా 4,166 దరఖాస్తు దారులు పోటీ పడ్డారు. డిసెంబర్‌ 1 నుంచి ప్రారంభమయ్యే నూతన మద్యం పాలసీ ప్రకారం లైసెన్స్‌ పొందినవారిని ఆగస్టు 21న విపంచిలో లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. అయితే కొన్నేళ్లుగా మద్యం వ్యాపారం కొనసాగిస్తున్నవారికి, రాజకీయ నాయకులకు చాలా తక్కువ మందికే అవి దక్కాయి. దీంతో ఎలాగైనా వైన్‌ షాపులు దక్కించుకోవాలని గుడ్‌విల్‌ చెల్లించయినా దక్కించుకుంటున్నారు.

సిద్దిపేట సర్కిల్‌ పరిధిలో ఉన్న రెండు మద్యం దుకాణాల్లో ఒకటి రూ1.03 కోట్లు, మరొకటి రూ.1.2 కోట్లకు అలాగే గజ్వేల్‌ పరిధిలో ఉన్న రెండు దుకాణాలు ఒకొక్కటి రూ.80 లక్షలకు, చేర్యాల పరిధిలో ఒక దుకాణం రూ.80 లక్షలు, మరొకటి రూ.1.05 కోట్లకు గుడ్‌విల్‌ కింద ఇచ్చినట్లు సమాచారం.

ఇటీవల ములుగు మండలం కొత్తురు గ్రామంలో అధిక మొత్తంలో గోవా మద్యం పట్టు బడిన విషయం తెలిసిందే.. అదేవిధంగా మద్యం షాపులు లైసెన్స్‌ పొందిన వారి ఆధ్వర్యంలో కొనసాగుతాయా? లేక గుడ్‌విల్‌ తీసుకున్న వారి ఆధ్వర్యంలో కొనసాగుతాయా? అనేది మరో పెద్ద ప్రశ్న.. దానిపై ఎక్సైజ్‌ అధికారులు దృష్టి పెట్టాల్సిందే మరి.

రోజుకు రూ.3 లక్షలు అమ్మితేనే ఏడాదికి రూ.10 కోట్లు

మద్యం దుకాణంలో రోజుకు రూ.3 లక్షల వ్యాపారం జరిగితే సంవత్సరానికి రూ.10 కోట్ల విలువచేసే మద్యం విక్రయాలు జరగనున్నాయి. లైసెన్స్‌ ఫీజు స్లాబ్‌ రూ.55 లక్షలు ఉంటే ఏడాదికి రూ.5 కోట్ల విలువ చేసే మద్యాన్ని అందించనున్నారు. దానికి 17 నుంచి 20 శాతం లాభం వస్తుంది. రూ.5 కోట్ల విలువ దాటితే 8 నుంచి 10 శాతం మార్జిన్‌ రానుంది. ఇలా అమ్మకాలు జరిగితే సుమరుగా రూ.1.25 కోట్ల లాభం రానుంది. సిబ్బంది జీతాలు, ఇంటి కిరాయి, గుడ్‌విల్‌ ఇచ్చిన కోటి రూపాయలకు మిత్తి మొత్తం కలిపి సుమారుగా రూ.35 లక్షలు ఖర్చు కానుంది. ఎక్సైజ్‌ శాఖకు లైసెన్స్‌ ఫీజు కింద రూ.55 లక్షలు, అలాగే గుడ్‌ విల్‌ కింద ఇచ్చిన దానిలో రూ.50 లక్షలు తీస్తే మొత్తంగా రూ.1.35 కోట్లు ఖర్చు కానుంది. అంటే లాభం రాకపోగా రూ.10 లక్షలు నష్టమే రానుంది. ఇలా రెండేళ్లకు రూ.20 లక్షల నష్టం వస్తుంది. దానిని అధిగమించేందుకు మద్యం వ్యాపారులు అడ్డదారులు తొక్కుతారా? కల్తీ మద్యాన్ని విక్రయించే అవకాశం ఉందా? అనే సందేహాలు తలెత్తుతున్నాయి.

సహకరిస్తున్నా.. జాప్యమెందుకు?

అడిషనల్‌ కలెక్టర్‌ గరీమా అగర్వాల్‌


శ్మశానవాటిక పనులను పరిశీలిస్తున్న అడిషనల్‌ కలెక్టర్‌ గరీమా అగర్వాల్‌

హుస్నాబాద్‌: పట్టణ అభివృద్ధికి సహకరిస్తున్నా.. అవసరమైన నిధులు అందజేస్తున్నా.. పనుల్లో జాప్యం ఎందుకు జరుగుతోందంటూ సిద్దిపేట జిల్లా అడిషనల్‌ కలెక్టర్‌ గరీమా అగర్వాల్‌ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె శనివారం పట్టణంలోని పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. స్మశానవాటిక పనుల్లో జాప్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మున్సిపల్‌ కార్యాలయ భవన నిర్మాణం, పట్టణ సమైక్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టీల్‌ బ్యాంక్‌ను పరిశీలించారు. కాంట్రాక్టర్లు, కార్మికులు అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న మున్సిపల్‌ ఏఈ సాయి ప్రణీత్‌కు షోకాజ్‌ నోటీస్‌ జారీ చేశారు. మరో వారం రోజుల్లో పురోగతి కనిపించకపోతే మున్సిపల్‌ కమిషనర్‌పై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్‌ హెల్త్‌ ఈఈ వీరప్రతాప్‌, మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ ఆకుల రజిత, వైస్‌ చైర్‌పర్సన్‌ అయిలేని అనిత, కమిషనర్‌ రాజశేఖర్‌, కౌన్సిలర్లు కొంకట నళినిదేవి, గోవిందు రవి, ఆర్‌ఐ కృష్ణ, మెప్మా టౌన్‌ కో ఆర్డినేటర్‌ రాజు, మున్సిపల్‌ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి క్రీడలు


దౌల్తాబాద్‌: వాలీబాల్‌ ఫైనల్స్‌లో తలపడుతున్న కొడిపల్లి, సదాశివాపేట జట్లు

దౌల్తాబాద్‌(దుబ్బాక): లింగరాజుపల్లి ఎంజేపీ గురుకుల బాలుర పాఠశాలలో 21 నుంచి 23 వరకు జరిగిన జిల్లా స్థాయి క్రీడలు శనివారంతో ముగిశాయి. ఖోఖోలో విన్నర్‌గా (తునికీ), రన్నరప్‌గా (దౌల్తాబాద్‌), కబడ్డీలో విన్నర్‌గా (సదాశివాపేట), రన్నరప్‌గా (దిగ్వల్‌), వాలీబాల్‌లో విన్నర్‌గా (కొడిపల్లి), రన్నర్‌గా(సదాశివాపేట), టెన్నికైట్‌లో విన్నర్‌గా (తునికీ), రన్నర్‌గా (దౌల్తాబాద్‌), చెస్‌లో విన్నర్‌గా (శంకరంపేట), రన్నర్‌గా (దిగ్వల్‌), మార్చ్‌ఫాస్ట్‌లో విన్నర్‌గా (దౌల్తాబాద్‌), క్యారమ్స్‌లో విన్నర్‌గా (సదాశివాపేట) జట్లు విజయం సాధించినట్లు పీడీ వెంకట్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌ కనకరాజు, పాఠశాల సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య


రఘుపతిరెడ్డి (ఫైల్‌)

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఒక రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చంద్లాపూర్‌లో శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. ఎస్‌ఐ సుభాష్‌ గౌడ్‌ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చెంద్రపు రఘుపతిరెడ్డి(55)కి భార్య మంగమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇటీవల తమ ఇంటి నిర్మాణం కోసం అప్పులు చేయడంతో ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. తీవ్ర మనస్తాపం చెందిన శుక్రవారం రాత్రి వ్యవసాయ బావివద్ద పురుగుల మందు తాగి తన కుమారుడికి ఫోన్‌ ద్వారా విషయం చెప్పాడు. వెంటనే కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని అతడిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. రఘుపతిరెడ్డి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఆయన సోదరుడు రాజిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ సుభాష్‌ గౌడ్‌ తెలిపారు.

అప్పుల బాధతో..


చంద్రమౌళి(ఫైల్‌)

చిన్నశంకరంపేట(మెదక్‌): అప్పుల బాధతో ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ నారాయణ్‌గౌడ్‌ కథనం ప్రకారం చిన్నశంకరంపేట మండలం జంగరాయి గ్రామంలో కమ్మరి చంద్రమౌళి(45) శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు చంద్రమౌళిని మెదక్‌ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గాంధీ అస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. చంద్రమౌళికి భార్య చంద్రకళ, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

వెల్లివిరిసిన నవోదయం



కళాఉత్సవ్‌ క్లస్టర్‌ పోటీలకు వేదికగా వర్గల్‌ నవోదయ

ప్రతిభ చాటిన విద్యార్థులు


వర్గల్‌ విద్యార్థిని అశ్వినిని గెలిపించిన కళాఖండమిదే

వర్గల్‌(గజ్వేల్‌): భరత నాట్యం.. కూచిపూడి నృత్యం.. జానపద సవ్వడులు.. సంగీత స్వరాలు.. కుంచెలతో జాలువారిన చిత్రాలు, సందేశాత్మక మట్టిబొమ్మలు, అట్టముక్కల ఆకృతులు.. మూడు రోజుల పాటు కళాఉత్సవ్‌ సంగీత, చిత్రలేఖనం, నృత్య పోటీలకు వర్గల్‌ నవోదయ విద్యాలయం వేదికయింది. స్ఫూర్తిదాయకంగా, సందేశాత్మకంగా సాగిన ఈ క్లస్టర్‌ పోటీలలో సత్తాచాటి నవోదయ విద్యాలయాల విద్యార్థులు బెంగళూరులో 25, 26 తేదీలలో జరగనున్న రీజినల్‌ పోటీలకు ఎంపికయ్యారు. రీజినల్‌ స్థాయిలోనూ ప్రతిభ చాటి రాష్ట్రానికి వన్నెతెస్తామని ధీమా వ్యక్తం చేశారు.

చదువుకుంటేనే గౌరవం



మాది సంగారెడ్డి జిల్లా మునిపల్లి గ్రామం. వర్గల్‌ నవోదయలో పదకొండో తరగతి చదువుకుంటున్న. చదువుకుంటేనే సమాజంలో గౌరవం లభిస్తుంది. ఆ సందేశంతో ఓ గొట్టంలో కూర్చుని ఆడపిల్ల చదువుకుంటున్నట్లు త్రీడీ ఆర్ట్‌ మట్టి బొమ్మ తయారు చేశా. రీజినల్‌ పోటీకి ఎంపికయ్యా.
– అశ్విని (వర్గల్‌ నవోదయ)

తెలంగాణ సంస్కృతిని చాటుతా



చిన్నప్పటి నుంచి బొమ్మలు గీయడం హాబీ. జాతీయ ఎన్విరాన్‌మెంట్‌ డే సందర్భంగా 'సేవ్‌ ఓసియన్‌ ఫ్రం ప్లాస్టిక్స్‌' పేరుతో వేసిన చిత్రం జాతీయస్థాయి పురస్కారం సాధించింది. ఈ కళాఉత్సవ్‌లో మన సంస్కృతి చాటే గంగిరెద్దులోళ్ల బొమ్మతో రీజియన్‌ స్థాయి పోటీలకు ఎంపికవడం సంతోషం కలిగిస్తున్నది.
– ఇంగోలి అవినాష్‌ (వరంగల్‌ నవోదయ)

పాటంటే ప్రాణం



మాది జగిత్యాల జిల్లా మెట్‌పల్లి. కరీంనగర్‌ నవోదయలో టెన్త్‌ చదువుతున్న. నాకు పాటంటే ప్రాణం. వర్గల్‌ మీట్‌లో 'పొడుస్తున్న పొద్దుమీద..' జానపద గీతాలాపనతో రీజియన్‌ పోటీకి ఎంపికయ్యా.
– జి.మనస్విని (కరీంనగర్‌ నవోదయ)

భూపాల రాగం వాయించా



నాకు ఇన్‌స్ట్రుమెంట్‌ మ్యూజిక్‌ అంటేనే ఎక్కువ ఇష్టం. కళా ఉత్సవ్‌లో హార్మోనిపై ప్రథమన గణనాయక అంటూ భూపాలరాగం వాయించి రీజియన్‌ పోటీకి ఎంపికయ్యా.
– యూనుస్‌ (నిజామాబాద్‌ నవోదయ)

ముగిసిన క్రీడా పోటీలు


వర్గల్‌ విద్యార్థినులతో ఆర్సీవో ప్రభాకర్‌ తదితరులు

వర్గల్‌(గజ్వేల్‌): జ్యోతిబా పూలే గురుకులంలో మూడు రోజులుగా జరుగుతున్న జిల్లా స్థాయి అండర్‌ 17 బాలికల ఆటల పోటీలు శనివారం ముగిశాయి. గురుకుల క్రీడాకారులు ప్రతిభ చూపి చాంపియన్‌షిప్‌ దక్కించుకున్నారు. వర్గల్‌ విద్యార్థిని నవనీత చక్కని ప్రతిభతో వ్యక్తిగత ఛాంపియన్‌షిప్‌ సాధించింది. కబడ్డీ, ఖోఖోలో, చెస్‌లో వర్గల్‌, వాలీబాల్‌లో నర్సాపూర్‌, టెన్నికాయిట్‌లో దుబ్బాక క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. విజేతలకు రీజినల్‌ కోఆర్డినేటర్‌ ప్రభాకర్‌, ప్రముఖ వైద్యులు గూడూరి శ్రీనివాస్‌రావు, సుమనలతో కలిసి బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆతిథ్య గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ లక్ష్మీదేవి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

12 మంది బైండోవర్‌

చిన్నశంకరంపేట(మెదక్‌): గుడుంబా విక్రయించిన 12 మందిని చిన్నశంకరంపేట తహసీల్దార్‌ చంద్రశేఖర్‌రెడ్డి ఎదుట ఎక్సైజ్‌ అధికారులు బైండోవర్‌ చేశారు. వారంతా గవ్వలపల్లి తండాకు చెందినవారని అధికారులు తెలిపారు. గుడుంబారహిత సమాజం కావాలని రామాయంపేట ఎక్సైజ్‌ సీఐ జయసుధ, ఎస్‌ఐ విజయ్‌ సిద్దార్థ గిరిజన తండాలో శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలోహెచ్‌సీ యాదగిరి, పీసీ స్వామి ఉన్నారు.

పత్తి పంట ధ్వంసం

- దారుణానికి పాల్పడిన గుర్తు తెలియని వ్యక్తులు
- రూ.1.5 లక్షల మేర నష్టం

వట్‌పల్లి (ఆందోల్‌): గుర్తుతెలియని వ్యక్తులు పత్తి పంటను ధ్వంసం చేశారు. చేతికి అందివచ్చే పంట కళ్ల ముందే నాశనమవడంతో ఇద్దరు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కన్సాన్‌ పల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన రైతులు మల్లేశం, ఎరగొల్ల నారాయణ రెండెకరాల పత్తి సాగు చేశారు. అందులో దాదాపు ఎకరా మేర పత్తి మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. శనివారం ఉదయం పొలానికి వెళ్లి చూడగా పత్తి మొక్కలు ధ్వంసమై ఉండడం చూసి కన్నీటి పర్యంతమయ్యారు. తమకు సుమారు రూ.1.5 లక్షల మేర నష్టం వాటిల్లిందని వాపోయారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని సర్పంచ్‌ యాదగౌడ్‌ కోరారు.

ప్రైవేటుకు దీటుగా సర్కార్‌ బడులు

- విద్యాశాఖ జాయింట్‌ డైరెక్టరు సోమిరెడ్డి


మాట్లాడుతున్న సోమిరెడ్డి

కొండపాక(గజ్వేల్‌): ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన జరగాలని విద్యాశాఖ జాయింట్‌ డైరెక్టరు సోమిరెడ్డి పేర్కొన్నారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలోని హైస్కూల్లో శనివారం పేరెంట్స్‌ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కార్‌ బడుల్లో గుణాత్మకమైన విద్యనందించేందుకు ప్రభుత్వం మన ఊరు మన బడి పథకంలో ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ నిర్వహించిందన్నారు. ప్రైవేటు స్కూళ్లలో పిల్లలను పంపిస్తూ తల్లిదండ్రులు ఫీజుల భారం నెత్తిన వేసుకోవద్దని సూచించారు. పాఠశాలల నిర్వహణ తీరుపై ఎప్పటికప్పుడు ప్రజా ప్రతినిధులు, ఎస్‌ఎంసీ కమిటీ పరిశీలన చేయాలన్నారు. ఈ సందర్భంగా బడుల బలోపేతం కోసం ప్రభుత్వం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెళకువలపై తల్లిదండ్రుల సలహాలు, సూచనలు స్వీకరించారు. సబ్జెక్టుల్లో విద్యార్థులు ప్రతిభలు గుర్తించేందుకు ప్రశ్నలను అడుగుతూ సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో సర్పంచ్‌ పొల్కంపల్లి జయంతి, గెజిటెడ్‌ ప్రధానోపాధ్యాయుడు బి. సత్తయ్య, సెక్టోరియల్‌ అధికారి రంగనాథ్‌, ఎస్‌ఎంసీ చైర్మన్‌ మల్లం ఐలయ్య, పీఎస్‌ఆర్‌ ట్రస్టు నిర్వాహకులు నరేందర్‌, నాయకులు సంపత్‌, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

లింగార్షక బుట్టలతో మొగిపురుగు నివారణ

సిద్దిపేటరూరల్‌: ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల్లో వరిలో మొగి పురుగు నివారణకు ఎకరానికి 10 లింగార్షక బుట్టలను అమర్చడం ద్వారా రెక్కల పురుగుల సంఖ్యను తగ్గించుకుని వరి పంటను రక్షించుకోవచ్చన్నారు. శనివారం తోర్నాల పరిశోధనా స్థానం, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు బుస్సాపూర్‌ గ్రామంలోని రైతుల వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వరి పంటకు మొగి పురుగు ఉధృతిని గమనించిన శాస్త్రవేత్తలు పలు రకాల సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం, తోర్నాల ప్రధాన శాస్త్రవేత్త డా. ఎస్‌. శ్రీదేవి, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త విజయ్‌, శాస్త్రవేత్తలు రమాదేవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక టెక్నాలజీతో కేసుల పరిష్కారం

తొగుట(దుబ్బాక): కేసులను చేధించడానికి ఆధునిక టెక్నాలజీని ఉపయోగించుకోవాలని అడిషనల్‌ డీజీపీ ఎస్‌.మల్లారెడ్డి సూచించారు. తొగుట పోలీస్‌ స్టేషన్‌, సీసీ కెమెరాల పనితీరును శనివారం ఆయన పరిశీలించారు. స్టేషన్‌ పరిధిలోని అనుమానితులు, రౌడీ షీటర్లపై నిఘా ఏర్పాటు చేయాలన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పోలింగ్‌ కేంద్రాలను పరిశీలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ కమలాకర్‌, ఎస్‌ఐ లింగం, దౌల్తాబాద్‌ ఎస్‌ఐ చైతన్య కుమార్‌రెడ్డి, రాయపోల్‌ ఎస్‌ఐ రఘుపతిరెడ్డి పోలీస్‌ సిబ్బంది పాల్గొన్నారు.

గోడ కూలి వాచ్‌మెన్‌ మృతి


సంజీవ్‌ రాథోడ్‌

పటాన్‌చెరు టౌన్‌: పాత గోడ కూలి వాచ్‌మెన్‌ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. నారాయణఖేడ్‌ మండలం అల్లాపూర్‌ మల్లపరిగి తాండాకు చెందిన సంజీవ్‌ రాథోడ్‌(40) బతుకుదెరువు కోసం పటాన్‌చెరు వలస వచ్చి వాచ్‌మెన్‌గా జీవనం సాగిస్తున్నాడు. శనివారం సాయంత్రం ఆయన పనిచేసే చోట రెండు భవనాల మధ్య ఉన్న మట్టితీసేందుకు వెళ్లాడు. ఆ సమయంలో పక్కనే ఉన్న పాతగోడ సంజీవ్‌ రాథోడ్‌పై కూలింది. ఆయనను స్థానికులు వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్టు వైద్యులు ధృవీకరించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చెరువులో పడి బాలుడి మృతి

పాపన్నపేట(మెదక్‌): మతిస్థిమితం లేని తల్లి వల్ల బిడ్డ మృతి చెందినట్లు ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు. చీకోడ్‌ గ్రామానికి చెందిన వడ్డే లలితను ఇటీవల తన భర్త వదిలి వెళ్లి పోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయింది. ఆమె శుక్రవారం సాయంత్రం తన మిగతా పిల్లలతో పాపన్నపేటకు బయలుదేరింది. ఆ క్రమంలో తన 18 నెలల కుమారుడు నాగరాజును కందిపల్లి చెరువు ఒడ్డున పడుకోబెట్టింది. నాగరాజు ప్రమాద స్థితిలో చెరువులో పడిపోయాడు. స్థానికులు కాపాడేలోపే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

చిన్నకోడూరు(సిద్దిపేట): రంగనాయక సాగర్‌ రిజర్వాయర్‌ కట్ట కింద గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ సుభాష్‌ గౌడ్‌ కథనం ప్రకారం 35- 40 ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి వారం రోజుల కిందట పెద్దకోడూరు గ్రామంలో అనుమానస్పదంగా తిరుగుతుండడం గ్రామస్థులు గమనించారు. ప్రమాదవశాత్తు కాలు జారి పడి మరణించి ఉంటాడని, ఘటన జరిగి నాలుగు రోజులు కావచ్చని ఆయన చెప్పారు. పంచాయతీ కార్యదర్శి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

కుళ్లిన స్థితిలో..

శివ్వంపేట(నర్సాపూర్‌): కొత్తపేట అటవీ ప్రాంతంలో కుళ్లిన స్థితిలో ఉన్న గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమయింది. రూప్ల పంచాయతీ పరిధిలోని ఇటుక బట్టీల్లో ఒడిశాకు చెందిన కూలీలు పనిచేస్తుంటారు. మూడు రోజుల క్రితం 40 ఏళ్ల మహిళ అదృశ్యమయింది. ఈ క్రమంలో శనివారం రాత్రి తెల్ల పలుగు గుట్టలో చెట్టుకు ఉరి వేసుకొని వేలాడుతున్న మృత దేహాన్ని స్థానికులు గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్‌ఐ రవికాంత్‌రావు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఏడుగురికి గాయాలు

రామాయంపేట(మెదక్‌): బాసర పుణ్యక్షేత్రానికి వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన ప్రమాదంలో ఏడుగురు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. హైదారాబాద్‌కు చెందిన శ్రీనివాస్‌ కుటుంబం శనివారం బాసర వెళ్లారు. తిరుగు ప్రయాణంలో నార్సింగ్‌ సమీపంలోని జాతీయ రహదారిపై వారు ప్రయాణిస్తున్న తుపాన్‌ వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో వాహనంలో ఉన్న శ్రీనివాస్‌, సుశీల, యామిని, అండాలు, మంగమ్మ, డ్రైవర్‌ రాయప్ప, మరో వ్యక్తి గాయపడ్డారు.

చెరువులో విష ప్రయోగం?

- లభ్యమైన మందు డబ్బాలు
- ఆందోళనలో గ్రామస్తులు


మందు డబ్బాల వద్ద కనబడుతున్న తెల్లటి ద్రావణం

నంగునూరు(సిద్దిపేట): స్థానిక చెరువులో క్రిమిసంహారిక మందు డబ్బాలు లభ్యం కావడంతో చెరువులో విష ప్రయోగం జరిగిందనే వదంతులు వ్యాప్తి చెందాయి. నీరంతా కలుషితమై చేపలు, మూగ జీవాలు మృత్యువాత పడతాయనే వదంతులతో శనివారం నంగునూరులో కలకలం రేగింది. గ్రామ శివారు లోని చౌడి చెరువు మత్తడి వద్ద నీటిలో రెండు పురుగు మందు డబ్బాలను గ్రామస్థులు గుర్తించారు. విషయం తెలుసుకున్న మత్స్యకారులు ఆందోళన చెందారు. సుమారు 183 మత్స్యకార కుంటుబాలు ఆ చెరువులో చేపలు పట్టడం ద్వారా జీవనోపాధి పొందుతున్నారు. ఇటీవలే చేప పిల్లలను కూడా వదలడంతో వారు ఆందోళన చెందారు. గుర్తు తెలియని వ్యక్తులు విష ప్రయోగం చేశారని, అధికారులు బాధ్యులను గుర్తించి కఠినంగా శిక్షించాలని మత్స్యకారులు కోరారు.